క్లుప్తంగా

శుభాకాంక్షలు



ఎమ్మెల్యే గాంధీతో డీసీ వెంకన్న, అధికారులు

గచ్చిబౌలి: నూతన సంవత్సరం మొదటి రోజును పురస్కరించుకొని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగూడ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో పుష్పగుచ్ఛం అందించి రాష్ట్ర ఐటీ శాఖామంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యే గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్లు వెంకన్న, సుధాంశు, కార్పొరేటర్లు జగదీశ్వర్‌గౌడ్, హమీద్‌పటేల్, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్లు సాయిబాబా, రవి ముదిరాజ్, సెంట్రల్ పార్కు ఫేస్–2 అసోసియేషన్, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, మహిళా విభాగం నాయకులు, పలువురు సీనియర్ నాయకులు ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగ, కార్మికులకు ఆటల పోటీలు



బహుమతులను ప్రదానం చేస్తున్న డీఎం రామయ్య

మియాపూర్: ఆర్టీసీ డిపో–1లో ఫార్మేషన్ డే సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు ఆటల పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డీఎం రామయ్య హాజరై పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేసి అభినందించారు.

ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు



టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి ఆలయంలో..

రాయదుర్గం: కొత్త ఏడాది మొదటి రోజు ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను, స్వామివార్లను దర్శించుకున్నారు. ఉదయం నుంచే అన్ని ఆలయాలకు కుటుంబ సభ్యులతో కలిసి ప్రజలు చేరుకున్నారు. పెద్ద ఎత్తున పూజలు చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 44 మందిపై కేసు

పటాన్‌చెరుటౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 44 మందిపై కేసులు నమోదయ్యాయి. పటాన్‌చెరు పట్టణం, మండలంలో మూడు చోట్ల వాహన తనిఖీలు నిర్వహించారు. పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు.. శనివారం అర్ధరాత్రి మద్యం తాగి పట్టుబడిన 44 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

శుభాకాంక్షలు

హఫీజ్‌పేట్: నూతన సంవత్సరం పురస్కరించుకొని ఆదివారం చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు రంజిత్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీలను హఫీజ్‌పేట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బాలింగ్ గౌతమ్‌గౌడ్ మొక్కను అందజేసి శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. హఫీజ్‌పేట్ బస్తీ కమిటీ అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, ముకేందర్, సంజయ్ గౌడ్ ఉన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

పటాన్‌చెరుటౌన్: నేషనల్ క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన క్రీడాకారుడికి పటాన్‌చెరు సీఐ ఆర్థిక సాయం అందించారు. నల్గొండ జిల్లా నిడమనూరు మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన ధనుష్ అస్సాం రాష్ట్రం గుహవాటిలో ఈ నెల 7, 8 తేదీల్లో జరగబోయే పోటీలకు ఎంపికయ్యాడు. పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతుండగా స్పందించిన సీఐ వేణుగోపాల్‌రెడ్డి విమాన టిక్కెట్, హోటల్ ఖర్చులకు సాయం అందించారు. పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని సూచించారు.



ధనుష్‌ని అభినందిస్తున్న సీఐ వేణుగోపాల్‌రెడ్డి

కొత్త ఏడాదిలో.. మరిన్ని లక్ష్యాలు

2023లో కొత్త లక్ష్యాలతో ముందుకు సాగేందుకు ప్రణాళికలను రూపొందించుకొని అందరూ ముందుకు సాగేందుకు నిర్ణయం తీసుకున్నారు. వాటి అమలు, లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలని, తోటి వారి సహకారంతో మరింత ముందుకెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అందులో భాగంగా గచ్చిబౌలి డివిజన్‌లోని వివిధ రంగాలకు చెందిన వారు తమ మనోగతాన్ని వెల్లడించారు. వారి మాటల్లోనే.. - రాయదుర్గం



గచ్చిబౌలిలోని ఫ్లైఓవర్ వ్యూ

యూనివర్సిటీ హోదా లక్ష్యం



'నిథమ్'కు యూనివర్సిటీ హోదా సాధించాలన్నదే లక్ష్యం. నిథమ్‌ను మరింత గ్రీన్ అండ్ క్లీన్ క్యాంపస్‌గా మార్చడంలో మియావాకీ ప్రాజెక్టు రెండు ఫేజుల్లో 2వేల మొక్కలు నాటాం. 3వఫేజ్‌లో మరో వెయ్యి నాటుతాం. ప్రస్తుతం 550 మంది విద్యార్థులు ఉండగా.. 900కి పెంచాలనే లక్ష్యం. క్యాంపస్‌ను జీరో కార్బన్ ఇన్‌స్టిట్యూట్‌గానే కాకుండా ఎకో ఫ్రెండ్లీ క్యాంపస్‌గా మారుస్తున్నాం. ఇప్పటికే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాం. సోలార్ సిస్టమ్‌తో విద్యుత్‌లో స్వయం సమృద్ధిని సాధించేలా చేస్తున్నాం.

– డాక్టర్ ఎస్.చిన్నంరెడ్డి, నిథమ్ డైరెక్టర్, గచ్చిబౌలి

ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం



ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ వహించడం అవసరం. నిత్యం వ్యాయామం, యోగా, వాకింగ్ చేయాలి. ఆహ్లాదవాతావరణం, గ్రీనరీ, నీటి కొలనులున్న చోట గడపడంపై దృష్టి పెట్టాలి. అనారోగ్యంగా ఉన్నవాళ్లు బయట తిరగొద్దు. ప్రతి ఒక్కరూ ఒత్తిడిని జయించేలా చూసుకోవాలి. ఉదయమే వ్యాయామం, నడక, యోగా చేయాలి. హృదయం ప్రశాంతంగా ఉండేలా చేస్తే ఎంతో మేలు. టెన్షన్లు దూరం చేసుకోవాలి, లైఫ్‌స్టైల్ మార్చుకోవాలి. సంతోషంగా ఉండేలా జీవన విధానాన్ని మార్చుకోవాలి.

– డాక్టర్ పాపారావు, కిమ్స్ కొండాపూర్ ఆస్పత్రి సీనియర్ వైద్యులు, కొండాపూర్

200 మెడికల్ సీట్లు లక్ష్యం



సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల నుంచి 200 మంది విద్యార్థులకు మెడికల్ సీట్లు, 60 మందికి ఎన్ఐటీ, ఐఐటీ సీట్లు సాధించడమే లక్ష్యం. అలాగే ఇద్దరికీ విదేశీ విశ్వవిద్యాలయంలో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో సీట్లు సాధించేలా చేయాలనుకుంటున్నాం. అదే విధంగా అకాడమిక్‌గా ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరంలో 100 శాతం ఫలితాలు సాధిస్తాం. అందుకోసం అధ్యాపకులు, అధికారుల సహకారంతో సమష్టిగా కృషిచేస్తాం.

– శారద, ప్రిన్సిపల్, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, పాఠశాల, గౌలిదొడ్డి

'ఎస్కీ' క్యాంపస్‌లో స్టార్టప్ కల్చర్ అభివృద్ధి చేస్తాం



ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా క్యాంపస్‌లో స్టార్టప్ కల్చర్ అభివృద్ధి చేస్తాం. చిన్న, సూక్ష్మ సంస్థల కోసం క్యాంపస్‌లో ఇంక్యుబేషన్, కో వర్కింగ్ స్థలాన్ని సృష్టిస్తాం. నైపుణ్యాలు, వ్యవస్థాపక సామర్థ్యాలను పెంచి ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల ఉపాధిని మెరుగుపర్చడమే లక్ష్యం. మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సులు తీసుకునేలా విద్యార్థులను ప్రోత్సహిస్తాం. అధ్యాపకులు, సిబ్బందికి సామర్థ్యాల పెంపుదల జెండర్ సెన్సిటైజేషన్ కార్యక్రమాలను నిర్వహించేలా చూస్తాం.

– డాక్టర్ జి.రామేశ్వరరావు, డైరెక్టర్, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా

కొత్త సిలబస్ రూపకల్పన



ఉత్తమ, నాణ్యమైన పరిశోధనలకు తెలుగు శాఖను కేంద్రంగా రూపొందిస్తాం. కొత్త సిలబస్ రూపకల్పన చేస్తున్నాం. తెలుగు భాషాసాహిత్యాలను అధ్యయనం చేస్తే లభించే ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే కోర్సుల రూపకల్పన చేస్తాం. హెచ్‌సీయూ తెలుగులో సీట్లు దొరకడం గగనంగానే ఉంది. అంకితభావం గల అధ్యాపకులతో నిరంతరం తరగతులు జరిగేలా చేస్తున్నాం. జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహిస్తూ విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంచే ప్రయత్నం చేస్తాం.

– ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, హెచ్‌సీయూ తెలుగు శాఖ అధ్యక్షులు

మంత్రికి శుభాకాంక్షలు



మంత్రి హరీశ్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్

పటాన్‌చెరుటౌన్: నూతన సంవత్సరం సందర్భంగా పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పలువురు ప్రజాప్రతినిధులను ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్‌తో కలిసి రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు, పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



కూకట్‌పల్లి: ఆంగ్ల సంవత్సరం పురస్కరించుకుని ఆదివారం శిల్పా ఎన్‌క్లేవ్ పార్కులో ఎలక్ట్రికల్ ఉద్యోగ సంఘం నాయకుడు వెంకటేశ్వరరావు సతీసమేతంగా బిల్వ పత్రి మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. అనంతరం ప్రజలకు నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కేలండర్ ఆవిష్కరణ



రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో ఆలయ నూతన కేలండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఆలయ నిర్వాహకులు డి.రవీందర్‌రెడ్డి, ఆలయ అర్చకులు వీవీవీఎస్ శర్మ ఆధ్వర్యంలో రూపొందించిన టేబుల్ కేలండర్‌ను వారు ఆవిష్కరించారు.

గోపీనగర్‌లో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి గోపీనగర్‌లో జనచైతన్య ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ కేలండర్‌ను ఆదివారం అసోసియేషన్ అధ్యక్షుడు జి.నర్సింహ, కమిటీ సభ్యులతో ఆవిష్కరించారు. గుల్‌మొహర్ పార్కు కాలనీ అధ్యక్షుడు షేక్ ఖాసీం, మాజీ కౌన్సెలర్ వీరేశంగౌడ్, టీఆర్ఎస్ బస్తీ కమిటీ అధ్యక్షుడు గోపాల్‌యాదవ్ తదితరులు ఉన్నారు.



భైరి నరేష్‌పై పీడీయాక్ట్ నమోదు చేయాలి



చందానగర్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

మియాపూర్: హిందూ దేవతలను అవమానించేలా మాట్లాడిన వారిపై పీడీయాక్ట్ అమలు చేసి కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. చందానగర్‌లో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో హిందూ దేవతలను అవమానించేలా మాట్లాడిన భైరి నరేష్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హిందూమతం, దేవుళ్లను అవహేళన చేస్తూ అసభ్య పదజాలంతో దాడులు చేస్తే భవిష్యత్‌లో ప్రజా ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. భైరి నరేష్‌పై పీడీ యాక్ట్ నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు బండారి కృష్ణ, బాలాజీ, సురేందర్, విజయ్‌కుమార్‌రెడ్డి, శివసేన నాయకులు, బీజేపీ నాయకులు ఉన్నారు.

స్పోర్ట్స్ హబ్‌గా పటాన్‌చెరు

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గ కేంద్రాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన డే అండ్ నైట్ క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువకులకు క్రీడలపై ఆసక్తి పెంచేందుకు పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్, మైత్రి క్లబ్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పండిత పరిషత్ డిమాండ్ల ఆమోదానికి కృషి

ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కూకట్‌పల్లి: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ భాషా పండితుల కోసం నిజాయితీగా చేస్తున్న సేవ అభినందనీయమని, భాషా పండితుల సమస్యలను త్వరలోనే పరిష్కరించి విద్యాశాఖను మరింత పటిష్టం చేస్తామని శాసనమండలి సభ్యుడు, రైతు బంధు సమన్వయ సమితి రాష్ట్ర చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నూతన సంవత్సరం సందర్భంగా ఆయన క్యాంపు కార్యాలయంలో ఆర్‌యూపీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి అబ్దుల్లా ఆధ్వర్యంలో సంఘం సభ్యులతో ఆయన సమావేశం అయ్యారు. 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న న్యాయమైన పండిత పరిషత్ డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీకి మొక్కని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కోశాధికారి వీఎస్ఎస్ శర్మ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎండీ హమీద్‌ఖాన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎండీ సాబీర్ పాషా, ఘనపురం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

242 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

గచ్చిబౌలి: నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకొని పోలీసులు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని గచ్చిబౌలి, మాదాపూర్ ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా 242 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను పోలీసులు నమోదు చేశారు. గచ్చిబౌలి పరిధిలో 5 ప్రాంతాల్లో, మాదాపూర్ పరిధిలో 6 ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అధికారులకు సన్మానం

గచ్చిబౌలి: ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టుల నిర్మాణ సమయంలో రోడ్లు, ఫ్లైఓవర్లు ఇతర వాటి నిర్మాణం సందర్భంగా ప్రైవేటు ఆస్తుల సేకరణలో కీలక పాత్ర పోషించిన అధికారులను సన్మానించారు. కొత్తగూడ ఫ్లైఓవర్ నిర్మాణ సమయంలో వెస్ట్‌జోన్ డిప్యూటీ చీఫ్ ప్లానర్ గణపతి, శేరిలింగంపల్లి సర్కిల్ టీపీఎస్ రవీందర్‌ను రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి కేటీఆర్, ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ, ఎంపీ రంజిత్‌రెడ్డి సమక్షంలో విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి వారిని శాలువాలతో సత్కరించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

పటాన్‌చెరుటౌన్: పటాన్‌చెరు మాజీ సర్పంచ్, ఎండీఆర్ ఫౌండేషన్ స్థాపకుడు దేవేందర్ రాజు సోదరుడు విక్రమ్‌రెడ్డి ఆదివారం రాత్రి గుండె పోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు శనివారం మృతుడి కుటుంబాన్ని ఫోన్‌లో పరామర్శించారు. మృతుడి తండ్రి మాజీ జెడ్పీటీసీ జైపాల్‌కు ఫోన్ చేసి ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

శుభాకాంక్షలు



ఎమ్మెల్యేకు మొక్క అందిస్తున్న షన్వితరెడ్డి

పటాన్‌చెరుటౌన్: జూనియర్ నేషనల్ టెన్నిస్ క్రీడాకారిణి షన్వితారెడ్డి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పూలమొక్క అందించి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో రాణించి, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు

'గణేశ్‌గడ్డ'కు పోటెత్తిన భక్తులు

పటాన్‌చెరుటౌన్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆదివారం మండల పరిధిలోని రుద్రారం గణేశ్‌గడ్డ దేవాలయాలతో పాటు పలు ఆలయాల వద్ద భక్తుల సందడి నెలకొంది. గణేశ్‌గడ్డ దేవాలయానికి భక్తుల తాకిడి ఎక్కువడంతో క్యూలైన్‌లో వెళ్లి స్వామి వారిని దర్శించుకునేలా ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్‌లు మల్లికార్జున్, ఈశ్వర్ ఏర్పాట్లు చేశారు.



పీఏనగర్‌లో ముగ్గుల పోటీల్లో మహిళలు

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

మియాపూర్: మియాపూర్‌లోని పీఏనగర్‌లో సంక్రాంతి పండగను పురస్కరించుకుని కొమిరిశెట్టి ఫౌండేషన్, విజేత సూపర్ మార్కెట్, ఫ్రెండ్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీలకు విజయలక్ష్మీ, వరలక్ష్మీ, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను ఎంపిక చేశారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మాధవి, లలిత, భీమమ్మ, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసిసోయేషన్ సభ్యులు విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.



మాదాపూర్ శిల్పారామంలో నృత్య ప్రదర్శనలు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గచ్చిబౌలి: మాదాపూర్‌లోని శిల్పారామంలో నూతన సంవత్సరం మొదటి రోజును పురస్కరించుకొని నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ముంబై నుంచి వచ్చిన సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత సతీష్‌కుమార్ బృందం వారిచే తాళవాద్య కచేరి, రేవతి సుబ్రహ్మణ్యం బృందం వారిచే భరత నాట్యప్రదర్శన, కుమారి మీథ బృందం కథక్ నృత్య ప్రదర్శన, ప్రీతిమహాపాత్రో బృందం ఒడిస్సీ నృత్య ప్రదర్శనలను కట్టిపడేశాయి. పెద్ద సంఖ్యలో సందర్శకులు తిలకించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



మోతీనగర్: నూతన సంవత్సరం సందర్భంగా ధరిత్రి ఫౌండేషన్ ద్వారా పేదలకు దుప్పట్లు, అనాథలకు నిత్యావసర వస్తువులు అందజేశారు. మూసాపేట, బాలానగర్, బోయినపల్లి, కొంపల్లి, సికింద్రాబాద్, ముషీరాబాద్, అమీర్‌పేట్ ప్రాంతాల్లో దుప్పట్లు పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ వైస్ చైర్మన్ నరసింహ పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, సభ్యులు, ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి, అనురాగ్ తదితరులు పాల్గొన్నారు.



శిల్పారామానికి 'కొత్త' శోభ

గచ్చిబౌలి: కొత్త ఏడాది సందడి మాదాపూర్‌లోని శిల్పారామంలో కనిపించింది. ఉదయం నుంచి రాత్రి వరకు 15 వేల మంది సందర్శకులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. శిల్పారామంలో అందాలను తిలకిస్తూ సందర్శకులు పులకించిపోయారు. ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో సందర్శకులు రావడంతో శిల్పారామం ప్రాంగణమంతా సందర్శకులతో కిటకిటలాడింది.

